
సాక్షి ఒడిశా

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,88,143లు, బంగారం 3గ్రాము 200 మిల్లీగ్రాములు, వెండి 23 గ్రాములు 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పర్లాకిమిడి రైల్వేస్టేషన్ సందర్శన

పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌ను ఖుర్దా రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, డీఆర్ఎం సౌరవ్ ప్రసాద్‌లు ప్రత్యేక రైలులో గురువారం సందర్శించారు.

- 8లో

వైద్యసేవలందించిన ఎమ్మెల్యే రాజెన్



సుందర్‌గడ్ జిల్లా రాజ్‌గంగ్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వైద్యునిగా రోగులకు సేవలు అందించాడు.

- 8లో

న్యూస్‌రీల్

మృతదేహం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మృతదేహం

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఒక గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మృతుని వయసు సుమారు 65 ఏళ్లు ఉంటుందని, తెల్లని దుస్తులు ధరించి ఉన్నట్లు రైల్వేపోలీసు ఐఐసీ బిజయ్ కుమార్ బెక్ తెలియజేశారు. మృతుని తలపై తీవ్రగాయాలు ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రాయగడ: జిల్లా బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దీనిలో భాగంగా ఉపాధ్యక్షులుగా ఉదయనాథ్ పాడి, పద్మనాభ దాస్, గౌరి మండంగి, దుర్యోధన పాలో, కంచాడ అశ్విన్, అర్చనా వర్మ, గోపీ ఆనంద్‌లు నియమితులవ్వగా, సాధారణ కార్యదర్శులుగా కిషోర్ చంద్ర పండ, హరికృష్ణ పాడి, రామకృష్ణ పండ, కార్యదర్శులుగా సుశీలా షరప్, చంద్రశేఖర్ ఖొర, ప్రతాప్ పువ్వల, బనమాలి గొమాంగొ, దేవేంద్ర పండ, హలధర్ హిమిరిక, శకుంతలా మాఝి, కోశాధికారిగా రవి శెఠిలను నియమించారు. అదేవిధంగా జిల్లా యువమోర్చా అధ్యక్షుడిగా ఉమేష్ ఖొసల, మహిళా అధ్యక్షురాలిగా బురిడి లక్ష్మీ, కృషక్ మోర్చా అధ్యక్షుడిగా కృష్ణ చంద్ర పండ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా బిజయ్ కృష్ణ సాబొరొ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా గుణనిధి బాగ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కడగళ్ల శ్రీను, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా సహదేవ్ ఖొసలను నియమించారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు



తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న లోకేష్(ఫైల్)

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ రైల్వేస్టేషన్‌లో వాటర్ సప్లయ్ చేసే ఒక కాంట్రాక్టర్ హత్య కేసుకు సంబంధించి పోలీసులు మంగళవారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో ఐఆర్‌బీ కానిస్టేబుల్స్ ఎం.చిన్నబాబు, గోపినాథ కౌసల్యలు ఉండగా.. ఈ హత్యకు సహకరించినందుకు గుణుపూర్‌కు చెందిన నరేంద్ర మహంతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 21వ తేదీన గుణుపూర్ రైల్వేస్టేషన్‌లో వాటర్ సప్లయ్ చేసే కాంట్రాక్టర్ అశోక్ బొరొడ (52)ను గుర్తు తెలియని దుండగులు హత్య చేసి, మృతదేహాన్ని గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రి ఆవరణలో పడేసి వెళ్లిపోయారు. తన తండ్రి మృతదేహం ఆస్పత్రి వద్ద పడి ఉందని తెలుసుకున్న మృతుని కొడుకు లోకేష్ గజపతి జిల్లా పర్లాకిమిడి కొటికా వీధి నుంచి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు చేపట్టిన దర్యాప్తులో భాగంగా హత్యకు కారకులైన ఇద్దరు నిందితులు ఐఆర్‌బీ కానిస్టేబుల్స్‌లో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేసి విచారించగా, తామే హత్య చేసినట్లు అంగీకరించారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రికి ఎదురుగా ఉన్నటువంటి రఘునాథ్ నాయిక్ అనే వ్యక్తి దుకాణంలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు జయపురం అగ్నిమాపక విభాగానికి తెలియజేయగా.. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే దుకాణం పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో దుకాణంలో ఉన్నటువంటి సరుకులు పూర్తిగా కాలిపోయాయని, వాటి విలువ సుమారు రూ.2 లక్షలకు పైనే ఉంటుందని అగ్నిమాపక విభాగ అధికారి సురేష్ బారిక్ అంచనా వేశారు. అయితే పూజ కోసం పెట్టిన దీపం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు అనుమానిస్తున్నారు.

అంబరాన్నంటుతున్న సంబరం



విద్యుత్ వెలుగుల్లో జేకేపూర్



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుని విగ్రహం

సదరు సమితి పరిధి జేకేపూర్‌లో పేపర్ మిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. ఈనెల 28వ తేదీ వరకు కొనసాగనున్న ఈ సంబరాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన వారు వేల సంఖ్యలో తరలి వస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఉత్సవాలను వీక్షించేందుకు లక్షల మంది హాజరవుతుండడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా ఈ ఉత్సవాలను జేకే పేపర్ మిల్ యాజమాన్యం ఘనంగా జరుపుతోంది. మార్కెట్ మైదానంలో జరుగుతున్న ఈ సంబరాల్లో భాగంగా విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటుండగా స్టాల్‌లు, చంద్రయాన్-3, ప్రత్యేకంగా శివుని విగ్రహంతో ఏర్పాటు చేసిన పార్క్ వంటివి సెల్ఫీ జోన్లుగా మారాయి. అదేవిధంగా విద్యుత్ వెలుగుల్లో జేకేపూర్ మెరిసిపోతోంది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి.

- రాయగడ



చంద్రాయన్-3 కళాకృతి



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గ అమ్మవారు



పాటలు పాడుతున్న గాయకుడు జయంత్



హాజరైన ప్రేక్షకులు

రామయ్య సన్నిధిలో హైకోర్టు జడ్జి



కోదండ రామాలయంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న జడ్జి గౌరి శంకర్ ఛత్రపతి



సౌమ్యనాథస్వామి సన్నిధిలో జడ్జి గౌరి శంకర్ ఛత్రపతి తదితరులు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను ఒడిశా హైకోర్టు జడ్జి గౌరి శంకర్ ఛత్రపతి గురువారం కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో వారికి స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ కావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగమండపంలో సేద తీరి, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ టీటీడీ అధికారులు, సిద్దవటం కోర్టు సిబ్బంది ఉన్నారు.

సౌమ్యనాథుడి సన్నిధిలో..

నందలూరు (రాజంపేట): అన్నమయ్య జిల్లాలో పేరుగాంచిన నందలూరులోని సౌమ్యనాథస్వామిని జడ్జి గౌరీ శంకర్ ఛత్రపతి కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి, ఆలయ చరిత్రను వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్‌లో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక ఒడియా ఛానల్‌లో రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సింహాచల్ పండ (52) అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గురువారం సాయంత్రం పండ అతని ద్విచక్ర వాహనంపై బిసంకటక్ నుంచి రాయగడకు వస్తుండగా, బాతుపూర్ పంచాయతీ పుటురుగుడ గ్రామానికి సమీపంలో ఎదురుగా వస్తున్న ఒక ట్రాక్టర్ అదుపుతప్పి ఢీకొంది. దీంతో తీవ్రగాయాలతో ప్రమాద స్థలంలో పడివున్న అతడిని కొంత మంది ఆటో సాయంతో బిసంకటక్‌లోని క్రిస్టియన్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలియజేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింహాచల్ పండ

31న గవర్నర్ ప్రమాణ స్వీకారం..?



రఘుబర్ దాస్

భువనేశ్వర్: రాష్ట్ర కొత్త గవర్నర్‌గా రఘుబర్ దాస్ ఈనెల 31న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సన్నిహిత వర్గాల సమాచారం. ఆయన ఒడిశా 26వ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈనెల 18న ఒడిశా గవర్నర్‌గా నియమితులైన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి అక్టోబర్ 29న భువనేశ్వర్ రానున్నారు. ఈ నియామకానికి ముందు రఘుబర్ దాస్ భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ఆయన 2014 నుంచి 2019 సంవత్సరం వరకు జార్ఖండ్ మొదటి గిరిజనేతర ముఖ్యమంత్రిగా పాలన పగ్గాలు చేపట్టడం విశేషం.

కటక్ కలెక్టర్‌గా నరహరి సెఠి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇద్దరు ఓఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న నరహరి సెఠి కటక్ జిల్లా కొత్త కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ స్థానంలో ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ భవానీ శంకర్ చొయిణి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

జవానుల పెద్ద మనసు



రక్తదానం చేస్తున్న జవాన్

జయపురం: దేశ రక్షణే కాదు సమాజ సేవకూ ముందుంటామంటున్నారు బీఎస్ఎఫ్ జవాన్లు. ఒక నిండు గర్భిణికి రక్తం కావాల్సి ఉండగా, ఇద్దరు జవాన్లు రక్తదానం చేసి పెద్ద మనసు చాటుకున్నారు. ఈ సంఘటన కొరాపుట్ జిల్లా లమతాపుట్‌లో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నంతపూర్ సమితి గుజేల్ గ్రామానికి చెందిన తులసీ ఖిలో అనే గర్భిణికి ఆరోగ్య పరిస్థితి బాగులేకపోవడంతో కుటుంబ సభ్యులు లమతాపుట్ ఆశాకిరణ్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమెకు అక్కడ రక్త పరీక్షలు జరుపగా హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండడంతో ఇబ్బంది తలెత్తిందని, వెంటనే ఆమెకు రక్తం అవసరమని బంధువులకు డాక్టర్లు స్పష్టం చేశారు. దీంతో రక్త దాతల కోసం కుటుంబ సభ్యులు పలువురిని సంప్రదించారు. ఈ విషయం తెలిసిన లమతాపుట్‌లో ఉన్న బీఎస్ఎఫ్ 65వ బెటాలియన్ క్యాంపుకు చెందిన బికాశ కుమార్, అంశుమాన్ నర్జారీలు వెంటనే ఆస్పత్రికి వచ్చి రక్తదానం చేశారు. దీంతో తులసి ఆరోగ్యం కుదుటపడటానికి సహకరించిన ఇద్దరు జవాన్లకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రక్త దాతలు మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి అవసరం వచ్చినా ఆదుకునేందుకు ముందుంటామని తెలియజేశారు.

51 కేజీల గంజాయి స్వాధీనం

జయపురం:

కొరాపుట్ జిల్లా పాడువ పోలీసుస్టేషన్ పరిధి దర్లిపుట్ సమీపంలో 51 కేజీల గంజాయి పట్టుకున్నట్లు నందపూర్ సబ్ డివిజన్ పోలీసు అధికారి గురువారం తెలియజేశారు. పోలీసులను చూసి నిందితులు గంజాయి వాహనాన్ని విడిచి పరారైనట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం రాత్రి పాడువ పోలీసు అధికారి దీపక్ బారిక్ నేతృత్వంలో పోలీసులు ధర్లిపుట్ ప్రాంతంలో ఒక టాటా సఫారి వాహణాన్ని ఆపారు. దీంతో నిందితులు వాహనాన్ని వదిలి చీకటిలో పరారయ్యారు. వాహనంలో తనిఖీలు నిర్వహించగా 51 కేజీల గంజాయి పట్టుబడిందని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



పట్టుబడిన గంజాయితో వాహనం

'సంక్షేమ ఫలాలు ప్రజలకు వివరించాలి'



పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ ప్రభుత్వం అనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పడాల్ పిలుపునిచ్చారు. బొయిపరిగుడ సమితి చంద్రపడ పంచాయతీలో గురువారం నిర్వహించిన పంచాయతీ స్థాయి పాదయాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బణువగుడ గ్రామంలో మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే బీజేడీ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతీ ప్రభుత్వ పథకంలో ప్రజలను మమేకం చేయాలని పార్టీ నాయకులకు సూచించారు. అనంతరం రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా కార్యవర్గ కార్యదర్శి, బొయిపరిగుడ సమితి అధ్యక్షుడు ప్రశాంత కుమార్ గుప్త, సమితి బీజేడీ అధ్యక్షుడు హేమంత మహాపాత్రో, రొణ ఆదివాసీ సాంప్రదాయ సమాజ్ అధ్యక్షుడు గుప్త నాయక్, లుకునాథ్ ఖొర, సుఖదేవ్ ఖొర, రబి ముదులి, రత్న నాయిక్, సనియ హంతాల్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర నందో సేవలు చిరస్మరణీయం

జయపురం:

ఒడియా సాహిత్యానికి, భాష ప్రగతికి దివంగత డాక్టర్ గంగాధర నందో అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక పంచానన మందిర కల్యాణ మండపంలో ఆయన స్మారక సభ గురువారం నిర్వహించారు. రచయిత హరిహర కరసుధా పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పశ్చిమ ప్రాంత జాగరణ కమిటీకి చెందిన విక్రమ ఆచార్య, ముఖ్యవక్తగా పశ్చిమ ప్రాంత జాగరణ కమిటీ సహాయకుడు హరిశ్చంద్ర పారిడ, గౌరవ అతిథిగా భారతీయ మజుదూర్ సంఘం ప్రాంతీయ సాధారణ కార్యదర్శి కృష్ణచంద్ర మిశ్ర, సాహితీవేత్త యజ్ఞేశ్వర పండ తదితరులు పాల్గొని గంగాధర నందో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాచీన సాంప్రదాయాలు, సంస్కృతి, కళల, పరిరక్షణకు నందో ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన చేసిన కృషి వలన అవిభక్త కొరాపుట్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ అనేక మంది మహిళలు, పిల్లలు, కళాకారులు ప్రాచీన సంస్కృతిపై అవగాహన చేసుకున్నారని పేర్కొన్నారు. ఆయన లేకపోవడం సాహిత్య రంగానికి తీవ్రమైన లోటుగా పరిగణించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత మిశ్ర, కృష్ణకేశవ షాడంగి, విశ్వహిందూ పరిషత్ బాబూబాయి షాడంగి, డాక్టర్ నిరంజన్ మిశ్ర, డాక్టర్ ప్రదీప్ మిశ్ర, రవీంద్ర సాహు, లక్ష్మీ బిశాయి, కౌశాష అగర్వాల్, సత్యనారాయణ మిశ్ర, విజయ భట్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న హరిహర కరసుధా పట్నాయిక్

క్లుప్తంగా

కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మె



సమ్మె నిర్వహిస్తున్న ఉద్యోగులు

పర్లాకిమిడి: స్థానిక బరంపురం కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులు తమ న్యాయమైన నాలుగు డిమాండ్లు నెరవేర్చాలని గురువారం నుంచి సమ్మె చేపడుతున్నారు. అఖిల ఒడిశా కేంద్ర కో-ఆపరేటివ్ బ్యాంకు ఎంప్లాయిస్ పిలుపు మేరకు 26, 27 తేదీల్లో విధులు బహిష్కరిస్తూ సమ్మె నిర్వహించనున్నట్లు తెలియజేశారు. బ్యాంకు ఉద్యోగులకు ఏడో వేతన కమిషన్ మేరకు జీతాల మంజూరు, పెన్షన్ కార్పస్ నిధి ఏర్పాటు తదితర డిమాండ్లతో సమ్మె చేపట్టారు. దీంతో ఈనెల 25 నుంచి లావాదేవీలు నిలిచిపోయాయి.

ఈనెల 28, 29 తేదీల్లో పాక్షిక చంద్ర గ్రహణం

భువనేశ్వర్: ఈనెల 28 మరియు 29 తేదీల మధ్య రాత్రి ఆకాశంలో పాక్షిక చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. రాష్ట్రంలో అర్ధరాత్రి 1.05 గంటల నుంచి 2.24 గంటల వరకు ఇది తారసపడుతుందని భువనేశ్వర్ వాతావరణ శాఖ (ఐఎండీ) గురువారం తెలిపింది. అక్టోబర్ 28 అర్ధరాత్రి చంద్రుడు పెనుంబ్రాలోకి ప్రవేశించినప్పటికీ, అంబ్రల్ దశ అక్టోబర్ 29 తెల్లవారు జామున ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి గ్రహణం కనిపిస్తుంది. ఈ గ్రహణం అంబ్రల్ దశ భారత కాలమానం (ఐఎస్టీ) ప్రకారం అక్టోబర్ 29న అర్ధరాత్రి 1.05 గంటలకు ప్రారంభమై 2.24 గంటలకు ముగుస్తుంది. గ్రహణం వ్యవధి 1.13 గంటలు ఉంటుంది. దేశంలో తదుపరి తారసపడే సంపూర్ణ చంద్రగ్రహణం 2025 సంవత్సరం సెప్టెంబర్ 7న ఉంటుందని వాతావరణ శాఖ సమాచారం. మన దేశంలో చివరిగా సంపూర్ణ చంద్ర గ్రహణం 2022 సంవత్సరం నవంబర్ 8న సంభవించింది.

వ్యక్తి అనుమానాస్పద మృతి


శివకుమార్ (ఫైల్)

రణస్థలం: మండలంలోని కొండములగాం పంచాయతీ ముక్తుంపురంలో అత్తవారికి ఇంటికి వచ్చిన బత్తిన శివకుమార్(41) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంలోని రామటాకీస్ ప్రాంతంలో నివాసముంటున్న శివకుమార్ దసరా పండగ కోసం ఈ నెల 24న ముక్తుంపురంలో అత్తవారింటికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో సరదా గడిపి బుధవారం సాయింత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే రణస్థలం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈయనకు భార్య గౌతమి, ఇద్దరు కుమారులు ఉన్నారు. విశాఖ నుంచి కుటుంబ సభ్యులు వచ్చి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని ఎస్సై జి.రాజేష్ తెలిపారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. మృతికి గుండెపోటు కారణమై ఉంటుందని, పూర్తి నివేదిక వచ్చాక వెల్లడిస్తామని చెప్పారు.

కలుషితాహారం తిని ఐదు మేకలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని ఆంజనేయపురం సమీపంలో గురువారం మధ్యాహ్నం కలుషిత ఆహారం తిని ఐదు మేకలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..టెక్కలి గొల్లవీధికి చెందిన కోనారి వెంకటరమణ, మరికొంత మందికి చెందిన మేకల మందను టెక్కలి నుంచి ఆంజనేయపురం వైపు తీసుకువెళ్తుండగా ఐదు మేకలు మృతిచెందాయి. పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రఘునాథ్‌కు సమాచారం అందివ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. 1962 అంబులెన్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించడంతో విషపు ఆహారం తినడం వల్లే మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ జాబితా

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో ఈ-క్రాప్ నమోదు శతశాతం పూర్తిచేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఖరీఫ్ - 2023 సీజన్‌లో 4.70లక్షల ఎకరాలలో పంటల సాగు, క్రాప్ పూర్తిచేశామని, అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 26 నుంచి 29 వరకు ముసాయిదా జాబితాను అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు.

గడ్డిమందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని బొరిగిపేటకు చెందిన దివ్వల చిలకమ్మ(70) అనే వృద్ధురాలు గడ్డి మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకమ్మ తన భర్త మృతిచెందడంతో కుమారుడు వద్ద ఉండేది. అతను 12 ఏళ్ల క్రితం భార్య, పిల్లలను విడిచి వెళ్లిపోవడంతో కోడలు, ఆమె ఒకే ఇంట్లో వేరువేరుగా ఉండేవారు. ఒంటరితనం భరించలేక తన ఆస్తిలో కొంతభాగం కుమార్తె కె.నీలవేణికి, మరికొంత భాగం కుమారుడి పేరు మీద రాసి అనంతరం పురుగుల మందు తాగి మృతిచెందింది. ఈ మేరకు కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైద్యసేవలందించిన ఎమ్మెల్యే రాజెన్



ఎమ్మెల్యే డాక్టర్ సి.ఎస్.రాజెన్ ఎక్కా

భువనేశ్వర్: సుందర్‌గడ్ జిల్లా రాజ్‌గంగ్‌పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వైద్యునిగా రోగులకు సేవలు అందించాడు. ఈ మానవీయ ఘటన కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో గురువారం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే డాక్టర్ సి.ఎస్.రాజెన్ ఎక్కా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాక ముందు ప్రభుత్వ వైద్యాధికారిగా పనిచేశారు. దీంతో రాజ్‌గంగ్‌పూర్ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో వైద్యుల కొరతను అధిగమించేందుకు గురువారం ఆయన సేవలందించారు.

ఇదీ విషయం

రాజ్‌గంగ్‌పూర్ సీహెచ్‌సీలో వైద్యుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రసారమైన మీడియా కథనాలు ఎమ్మెల్యేగా అధికారంలో కొనసాగుతున్న డాక్టర్ సి.ఎస్.రాజెన్ ఎక్కాని చైతన్యపరిచాయి. దీంతో ఆయనే హాజరై రోగులకు సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వృత్తి వైద్యమని, అందుకే రోగులకు సేవలందించేందుకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఈ సీహెచ్‌సీలో 6గురు వైద్యులను నియమించారు. అయితే వీరిలో ముగ్గురు పూజ సెలవుల కారణంగా ఆరోగ్య కేంద్రంలో రోస్టర్ డ్యూటీలో ఉన్నారని సుందర్‌గడ్ జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ధరణి రంజన్ శత్పతి తెలిపారు. ఈ కేంద్రంలో రోజుకు సగటున 300 నుంచి 400 మంది రోగులు హాజరు అవుతారు. కాబట్టి మరి కొంత మంది వైద్యుల నియామకం అవసరం ఉందన్నారు.

• కృతజ్ఞతలు


ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్‌తో రాజ్ భవన్‌లో గురువారం భేటీ అయ్యారు. పదవీ కాలం ముగియడంతో గణేషీ లాల్ ఈనెల 27వ తేదీన బయల్దేరనున్నారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి సేవలు, సహకారాన్ని అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రొఫెసర్ గణేషీ లాల్ సుమారు 5 సంవత్సరాల 5 నెలల పాటు రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ వ్యవధిలో ఆయన విశేష ప్రజాదరణ పొందారు.

- భువనేశ్వర్

ఘనంగా కుమార పౌర్ణమి ఉత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లా సాంస్కృతిక శాఖ మరియు ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో ప్యాలస్ వద్ద యూటెక్ కంప్యూటర్స్ కార్యాలయం ఆవరణలో కుమార పౌర్ణమి ఉత్సవాన్ని గురువారం సాయంత్రం జిల్లా అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కుమార పౌర్ణమి విశేషాలను ఒడిశా సాహిత్య అకాడమీ ప్రాంతీయ సభ్యులు బిచిత్రా నంద బెబర్తా తెలియజేశారు. దీనిలో భాగంగా మధ్యాహ్నం మహిళా కళాశాల విద్యార్థులకు పిండి వంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. కుమార పౌర్ణమి ఒడిశా సాంప్రదాయంలో భాగమని అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్ అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన కళాశాల విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ప్రగతి మహిళ సంఘటన్ ఉపాధ్యక్షుడు లోకనాథ మిశ్రా, కార్యదర్శి తనుజా శథపతి పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డా.ప్రదీప్ కుమార్ పాత్రో, బినోదిని సైన్స్ కళాశాల అధ్యక్షుడు మనోజ్ కుమార్ పట్నాయక్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి కుమారి అర్చనా మంగరాజ్, సభానేత్రి ప్రగతి మహిళా సంఘటన్ కల్పనా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి


స్పీకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్టీలు

ఆమదాలవలస: తమకు ఉద్యోగభద్రత కల్పించాలని ఏపీ క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్స్ (సీఆర్ఎంటీఎస్) ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద శాసన సభాపతి తమ్మినేని సీతారాంను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సభ్యుడు పి.తవిటినాయుడు, జిల్లా అధ్యక్షుడు బి.గిరి, జిల్లా కార్యదర్శి బి.నర్సింగరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ టోర్నీలో తవిటమ్మ ప్రతిభ


పీడీ తవిటమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస రూరల్: అఖిల భారత ప్రజా సేవల టోర్నమెంట్ కబడ్డీ పోటీల్లో ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ జెడ్పీ హైస్కూల్ పీడీ దంపాక తవిటమ్మ విజయం సాధించినట్లు హెచ్ఎం ఎం.తులసీబాయ్ తెలిపారు. గురువారం పీడీని సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 20 వరకు ఢిల్లీలో జరిగిన టోర్నమెంట్‌లో ఆంధ్ర ప్రదేశ్ మహిళల కబడ్డీ విభాగంలో జిల్లా తరఫున పీడీ ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. చురుకైన పాత్ర పోషించి విజయం సాధించడంతో మెడల్ అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫెన్సింగ్ ఎంపికలు


పోటీలను ప్రారంభిస్తున్న బలభద్రుని సురేష్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ/ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజయబావుటా ఎగురవేయాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా) అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి అండర్-19 బాలబాలికల ఫెన్సింగ్ ఎంపిక పోటీలు జరిగాయి. సీహెచ్ పల్లవి(ఆర్‌జీయూకేటీ శ్రీకాకుళం), కె.ఎస్.భవాని(ప్రభుత్వ జూనియర్ కళాశాల, పోలాకి), వై.మౌనిక(ఏపీ మోడల్ స్కూల్, ఎదుర్లవలస), బి.ఝాన్సీరాణి(ప్రభుత్వ జూనియర్ కళాశాల, పొందూరు) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఎన్.రామన్న, పరిశీలకులు డి.భవానీ(పి.డి), న్యాయ నిర్ణేత ఫెన్సింగ్ ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ, పీఈటీ రాహుల్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను వచ్చే నెల 1 నుంచి 3 వరకు నంద్యాలలో జరుగబోయే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫెన్సింగ్ పోటీలకి పంపిస్తామని రామన్న పేర్కొన్నారు.

ఇరువర్గాల కొట్లాటలో 14 మందిపై కేసు

పాతపట్నం: ఇరువర్గాల కొట్లాట, పరస్పరం ఇచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం 14 మందిపై కేసులు నమోదు చేశామని పాతపట్నం ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు. బడ్డుమర్రి పంచాయతీ బాసిగిట్టంగిలో కొనంగి అప్పలనరసమ్మ(అంగన్‌వాడీ కార్యకర్త), రింపి బారికి వర్గాల మధ్య కొట్లాట జరిగింది. అప్పలనరసమ్మ భర్త వీరయ్యతో పాటు ఆరుగురిపై, అలాగే రింపి బారికి, రింపి జానకితో పాటు నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పర్లాకిమిడి రైల్వేస్టేషన్ సందర్శన


రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరావు తదితరులు

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్‌ను ఖుర్దా రైల్వే డివిజన్ జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, డీఆర్ఎం సౌరవ్ ప్రసాద్‌లు ప్రత్యేక రైలులో గురువారం సందర్శించారు. స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులు, ప్లాట్ ఫారం ఎత్తు పనులను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, ఇతర బీజేపీ నాయకులు ఈస్టుకోస్టు జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. పూరీ- గుణుపురం ట్రైన్ కాశీనగర్ సమితి కె.సీతాపురం మరియు పాలసింగి వద్ద నిలుపుదల చేయాలని కోరారు. అనంతరం మనోజ్‌శర్మ విలేకరులతో మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాడానికి కృషి చేస్తానన్నారు. రాజావారి ప్యాలస్ మాదిరి నమూనాగా ప్రవేశ ద్వారం ఏర్పాటుచేయడానికి కూడా తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన అదే ట్రైనులో గుణుపూర్ వెళ్లారు.

తప్పిపోయిన గిరిజన బాలిక అప్పగింత


బాలికను అప్పగిస్తున్న దృశ్యం

మందస: మండలంలోని బొగాబంద పంచాయతీ కుడుమాసాయి గ్రామానికి చెందిన బాలిక సవర వజ్రమ్మ ఇటీవల తప్పిపోయింది. తల్లిదండ్రులు సవర జగ్గిలి, సవర రొంటి ప్రమాదంలో మరణించడంతో బాలిక మానసికంగా బాధపడుతోంది. కుటుంబసభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. ఇచ్ఛాపురం బోర్డర్‌లో పురుషోత్తం గ్రామానికి చెందిన రెండో వార్డు కౌన్సిలర్ చాట్ల తిరుపతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశవమాస్, పప్పల గిరి, దుదిష్టి, మోహన్, మహలక్ష్మి, హేమ బాలికను గుర్తించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 12 రోజుల పాటు బాలికకు వసతి, భోజనాలకు కల్పించారు. సమాచారాన్ని బొగాబంద, కొంకడాపుట్టి పంచాయతీలకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జి నాగేశ్వర బృందావన్, వైఎస్సార్ సీపీ నాయకులు రౌతు దుర్యోధన, ఉపసర్పంచ్ సవర రాజు, అగ్గున్న శివ, సుబ్బారావులకు గురువారం రాత్రి అప్పగించారు. క్షేమంగా తీసుకువచ్చి సోదరి సవర రజనికి అప్పగించారు. ఇరువర్గాలు ఎంతో బాధ్యతగా గిరిజన బాలికను బంధువులకు అప్పగించడంతో స్థానికులు అభినందనలు తెలిపారు.

టబాగాం అడవుల్లో పులి పాదముద్రల గుర్తింపు


కుసుమలలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖాధికారులు


పెద్దపులి అడుగులు

మందస: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో తిరుగుతున్న పెద్దపులి మందస మండలంలోని గిరిజన ప్రాంతాల్లో అడవులకు చేరినట్టు అధికారులు గుర్తించారు. ఏటబీలో ఒడిశా, ఆంధ్రా అటవీశాఖాధికారులు పెద్దపులిని గుర్తించి పట్టుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలితం ఇవ్వలేదు. గొప్పిలి, ఒడిశా సరిహద్దుల మీదుగా మందస మండలానికి చేరి.. సంధిగాం, కొంకడాపుట్టి, కిల్లోయి, గంద్రుగాం, బంసుగాం కొండలు, మెట్టలు మీదుగా కొండలోగాం ప్రాంతాలోకి చేరింది. టబాగాం ప్రాంతంలో పులి పాదముద్రలను చూసిన గిరిజనులకు అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు ఆధ్వర్యంలో డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము ఎఫ్‌బీఓలు ఎం.పోలయ్య, బాబురావు, సురేష్, జోగారావు, భానుమూర్తి, దుర్గాదేవి గురువారం సంఘటనా స్థలానికి చేరుకుని పాదముద్రలు గుర్తించారు. గతంలో ఏనుగులు కూడా ఇదే మాదిరిగా ఒడిశా నుంచి మందస మండలంలోని గిరిజన ప్రాంతాలకు వచ్చాయి. అవి నడిచిన దారినే పులి కూడా అనుసరించినట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో వారంతా మూడు బృందాలుగా వీడి కుల్లోగాం, కొండలోగాం, సంధిగాం, బొగాబంద, హంసరాళి, గంద్రుగాం, బంసుగాం తదితర ప్రాంతాల్లో పర్యటించి గిరిజనులకు అవగాహన కల్పించారు. పెద్దపులి ఆనవాళ్లు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. రాత్రి వేళల్లో కూడా పులిని గుర్తించడానికి ప్రయత్నాలు చేస్తామని ఎఫ్‌ఆర్వో మురళీకృష్ణనాయుడు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి


పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎంపీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి సహకారం అందజేస్తామని ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఇటీవలి జాతీయ, రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచి పతకాలు సాధించిన క్రీడాకారులను, జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారుల బృందాన్ని ఎంపీ గురువారం తన కార్యాలయంలో అభినందించారు.

స్టార్ ఆఫ్ ఇండియా, స్టార్ ఆఫ్ ఆంధ్రా అవార్డులు సొంతం చేసుకున్న ముంత గాయత్రిని అభినందిస్తూ దేశానికి ప్రాతినిధ్యం వహించేస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పడాల భూదేవి, శిక్షకుడు ఎం.మధుసూదనరావు, రుప్ప కార్తిక్, కొర్ను రాంబాబు, రుప్ప నరసింహానాయుడు, వందాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణ హత్య


జీడితోటల్లో ఉన్న మృతదేహం(ఇన్‌సెట్లో) కామమ్మ(ఫైల్)

మందస: ఉద్దాన ప్రాంతమైన లోహరిబంద పంచాయతీ చిన్నలొహరిబంద గ్రామానికి చెందిన తామాడ కామమ్మ(70) దారుణహత్యకు గురయ్యింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామమ్మకు ముగ్గురు కుమారులు. ప్రతి రోజూ తన జీడి, కొబ్బరితోటలను ఉదయాన్నే చూసేందుకు వెళ్లేది. యథావిధిగా ఈ నెల 25న వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుమారులు వెదకడం ప్రారంభించగా, ఆచూకీ లభించలేదు. గురువారం కూడా పరిసర ప్రాంత జీడితోటల్లో వెతకగా, తలపై గాయాలతో ఉన్న కామమ్మ మృతదేహాన్ని గమనించిన కుమారులు మందస పోలీసులు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సీహెచ్ హరికృష్ణ, కానిస్టేబుళ్లు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి చెవిలో ఉన్న మూడు తులాల బంగారు నాగులు, ముక్కు కమ్మలు గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా తెంచుకుపోయినట్టు పోలీసులు గుర్తించారు. శ్రీకాకుళం నుంచి డాగ్‌స్క్వాడ్‌ను తీసుకువచ్చి పరిశీలన చేయించారు. జాగిలం కొన్ని ప్రాంతాలకు వెళ్లడంతో ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి పెద్ద కుమారుడు రామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హరికృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

నగల దోపిడీకి యత్నం

సరుబుజ్జిలి: మండలంలో మర్రిపాడుకు చెందిన కందుల రమణమ్మపై గురువారం గుర్తు తెలియని వ్యక్తి ఆభరణాల కోసం దాడికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రమణమ్మ మర్రిపాడు నుంచి సరుబుజ్జిలిలోని బ్యాంకుకు వెళ్లింది. తిరిగి తన స్వగ్రామానికి వంశధార కుడి కాలువ గట్టుపై వస్తుండగా దారిలో ఆగంతకుడు వచ్చి ఆమె వద్ద ఉన్న బంగారు భరణాలు దోపిడీ చేయడానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కిందపడింది. ఇటుక రాయితో గాయపరచి అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన రమణమ్మను స్థానికులు వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ వద్ద ప్రస్తావించగా, ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వివేకంతో కూడిన తెగువ ప్రదర్శించాలి


స్టేషన్ ఆవరణలో అమరవీరుల ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న భాష్యం విద్యార్థినులు

శ్రీకాకుళం క్రైమ్ :

విద్యార్థినులు, యువతులు లైంగిక దాడులనుంచి రక్షించుకోవడానికి వివేకంతో కూడిన తెగువ ప్రదర్శించాలని శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు గురువారం భాష్యం స్కూల్ విద్యార్థినులతో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు దిశా, పోక్సో, నిర్భయ వంటి చట్టాలున్నాయని, ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు గానీ, పోలీసులకు గానీ, కళాశాల, స్కూల్ టీచర్లకు గానీ చెప్పాలని సూచించారు. పోలీసులకు చెబితే వివరాలు గోప్యంగా ఉంచి బాధిత బాలికలకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధివిధానాలు తెలియజేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ ఫ్లెక్సీలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మి

ఇష్టపడి చదవాలి..

శ్రీకాకుళం క్రైమ్ : ఇష్టపడి చదివితే ర్యాంకులు, విజయాలు వాటంతటవే వస్తాయని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కె.లక్ష్మి అన్నారు. గురువారం ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ విద్యార్థినులతో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని.. అవాంతరాలు ఎదురైనా అలవోకగా దాటుకుని ముందుకెళ్లాలని అన్నారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

రోగులకు మెరుగైన వైద్యం

● కలెక్టర్ ఎ.నాగలక్ష్మి

బొండపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, రిఫరల్ కేసులు ఆస్పత్రిలో చేరేలా చూడాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. మండలంలోని బి.రాజేరు గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె గురువారం పరిశీలించారు. సేవలపై ఆరా తీశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 455 సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. మరో 100 సచివాలయాల పరిధిలో నిర్వహించాల్సి ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం నెలకున్న వర్షాభావ పరిస్థితులతో 2,600 ఎకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయినట్టు గుర్తించామన్నారు. మరో వారం రోజుల్లో వర్షం కురవకపోతే 25 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలియజేశారన్నారు. అంతకు ముందు వైద్య శిబిరాన్ని ఎంపీపీ చల్లా చలంనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శంకరరావు, ఏఓ డి.వెంకటరమణ, సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు అరికట్టాలి

● ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి



కూనేరు చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి

కొమరాడ: ఒడిశా నుంచి సారా, మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒడిశా సరిహద్దులో ఉన్న కొమరాడ మండలంలోని కూనేరు చెక్‌పోస్టును పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర రహదారిలో వచ్చిన ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించి నిషేధిత పదార్థాలు జిల్లాలోకి రాకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి మాదక ద్రవ్యాలు దొరికినా కచ్చితంగా కేసు నమోదులు చేయాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

విజయనగరం: పైడితల్లమ్మవారి జాతర, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ మేరకు గురువారం విజయనగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు..విజ్జి స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 11 జట్లు హాజరయ్యాయి. రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నారు. మొదటి రోజు పోటీలను సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్ ప్రారంభించారు. అలాగే ఒక్క రోజు పాటు నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు సీఈఓ అభినందనలు తెలిపారు.

సిరిమాను రథాన్ని సిద్ధం చేస్తున్నాం..

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 31న నిర్వహించనున్న సిరిమానోత్సవానికి సంబంధించి సిరిమాను రథాన్ని సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం స్థానిక పైడితల్లి అమ్మవారి కల్యాణ మంటపం ఆవరణలో పైడిమాంబ సేవా సంఘం, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతేడాది సిరిమాను ఊరేగింపు ఆలస్యం కావడానికి గల కారణాలపై సమీక్షించారు. ఈ ఏడాది ఊరేగింపు ఆలస్యం కాకుండా నిర్ణీత సమయానికల్లా రథాన్ని సిద్ధం చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం సిరిమాను తయారు చేసే వడ్రంగి ప్రతినిధులతో చర్చించారు. సిరిమానుతో పాటు రథాలు తిరిగే సమయంలో ఇతరులను అనుమతించకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీస్‌శాఖకు సూచించారు. సమావేశంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆర్‌జేసీ ఎంవీ సురేష్‌బాబు, ఆర్డీఓ సూర్యకళ, తహసీల్దార్ కోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టు కోచ్‌గా శ్రీనివాస్

విజయనగరం: అక్టోబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 2 వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంలో జరగనున్న 35వ ఆలిండియా పోస్టల్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ పోస్టల్ కబడ్డీ జట్టుకు కోచ్‌గా విజయనగరం హెడ్‌పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్న కబడ్డీ క్రీడాకారుడు పతివాడ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడ సర్కిల్ ఆఫీస్ నుంచి గురువారం నియామక ఉత్తర్వులు వచ్చాయి. సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పతివాడ శ్రీనివాసరావు 1997 నుంచి పలు జాతీయ పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా పలుమార్లు వ్యవహరించారు. శ్రీనివాసరావు నియామకం పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్ కౌశిక్, సూరిబాబు, కబడ్డీ గురువు బొమ్మన రామారావు, తపాలా శాఖ సిబ్బంది, కబడ్డీ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

బాలల సైన్స్ కాంగ్రెస్‌కు సమాయత్తం

● ప్రాజెక్టుల రూపకల్పనలో ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు
● నవంబర్ 8న జిల్లాస్థాయిలో నిర్వహణ



గత ఏడాది జాతీయస్థాయికి ఎంపికైన 'పంట వ్యర్థాల నుంచి ఎరువుల తయారీ' ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో అవార్డు అందుకుంటున్న జిల్లా విద్యార్థులు (ఫైల్)



ప్రాజెక్టుల తయారీలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: బాల శాస్త్రవేత్తలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూని కేషన్ ఆధ్వర్యంలో బాలలసైన్స్ కాంగ్రెస్‌ను ఏటా నిర్వహిస్తున్నారు. నిర్దిష్ట సమస్యలపై శాస్త్రీయ పరిశోధనలు చేపట్టేందుకు పిల్లలను ప్రోత్సహించే ప్రత్యేకమైన కార్యక్రమం ఇది. బాలల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. బాలలు నిత్య జీవితంలోని పరిస్థితులతో విజ్ఞానశాస్త్రాన్ని పరస్పరం అనుసంధానం చేయడం ద్వారా క్లిష్టమైన స్థానిక సమస్యలకు పరిష్కారం కనుక్కోవాల్సి ఉంటుంది. సామాజిక సమస్యలపై శాస్త్రీయంగా ఆలోచించడం, కారణాలను అన్వేషించడం , శాస్త్రీయ పద్ధతిలో పరిష్కరించడానికి బాలలు ప్రయత్నించాల్సి ఉంటుంది. దానికి సంబంధించిన పరిశోధనల ద్వారా గ్రహించిన అంశాలను నివేదికలుగా తయారు చేసి ప్రాజెక్ట్ రిపోర్టును జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శించాలి. బాల సైంటిస్టులు చేసే అత్యుత్తమ ప్రాజెక్టుల ప్రదర్శనకు జాతీయ సైన్స్ కాంగ్రెస్ వేదిక అవుతుంది. ఈ నేపథ్యంలో నవంబర్ 8న ఆప్‌కాస్ట్ నేతృత్వంలో జిల్లా స్థాయిలో ఈ ప్రదర్శనలు నిర్వహించేలా అధికార యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది.

వీరు అర్హులు..

10-17సంవత్సరాల బాలలకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు నిర్వహించి వారిలో ప్రతిభను వెలికితీస్తుంది. జాతీయ స్థాయిలో ఉత్తమమైన ప్రాజెక్ట్‌గా నిలిస్తే దానికి పేటెంట్ హక్కు లభిస్తుంది. ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులకు జాతీయస్థాయిలో రిజర్వేషన్, నగదు బహుమతి అందజేస్తారు.

ప్రాజెక్టులు చేయాల్సిన అంశం ఇదే..

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ 2023-24 జిల్లా స్థాయి పోటీలు నంబర్ 8వ తేదీన నిర్వహించనున్నారు.'ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' ఈ ఏడాది బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రధాన అంశం. దీనికి తోడు మీ పర్యావరణ వ్యవస్థను తెలుసుకోవాలి. ఆరోగ్యం పోషణ, శ్రేయస్సును పెంపొందించడం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు, పర్యావరణ వ్యవస్థ ఆధారిత జీవన విధానం, ఆరోగ్య కోసం సాంకేతిక ఆవిష్కరణ వంటి ఐదు ఉప అంశాల్లో మాత్రమే బాలల ప్రాజెక్టులు రూపొందించాల్సి ఉంటుంది. ఈ విధంగా విద్యార్థులు సిద్ధం చేసిన ప్రాజెక్టు నివేదికను సదరు పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ లింక్‌లో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్టు రూపకల్పన ఇలా...

● బాలలు ఎంచుకున్న ఉప అంశానికి సంబంధించి గైడ్ టీచర్ సహాయంతో సర్వే, పరిశీలన, ప్రశ్నావళి, కేస్ స్టడీస్ ఆధారంగా ప్రాజెక్టులు చేపట్టి, రిపోర్టు తయారు చేయాల్సి ఉంటుంది.
● ప్రెజెంటేషన్ సమయంలో ప్రాజెక్ట్ రిపోర్ట్, లాగ్ బుక్, నాలుగు చాప్టర్లు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది.
● ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్ 6 నిమిషాలు, వైవా 2 నిమిషాలు ఉంటుంది.
● ప్రతి పాఠశాల నుంచి కనీసం ఒక ప్రాజెక్ట్ తప్పనిసరిగా ఉండాలి.
● ఒక పాఠశాల నుంచి ఎన్ని ప్రాజెక్టులు అయినా సమర్పించవచ్చు.
● 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చు.

ఉత్తమమైనవిగా ఉండాలి



పరిశోధన చేసే దిశగా బాలలను సమాయత్తం చేయడమే సైన్స్ కాంగ్రెస్ లక్ష్యం. స్థానిక సమస్యలకు పరిష్కారం చూపేవిధంగా ఈ పరిశోధనలు ఉండాలి. శాస్త్రీయంగా పరిశోధనలు చేసి ప్రెజెంట్ చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయికి విద్యార్థులంతా సమాయత్తం కావాలి. ఈనెల 31 లోగా రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలి.

గిరడ లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం.

మార్గదర్శకులుగా ఉపాధ్యాయులుండాలి



విద్యార్థులు ప్రాజెక్టులు సిద్ధం చేయడంలో ప్రతి సైన్స్ ఉపాధ్యాయుడు మార్గదర్శకుడిగా ఉండాలి. ఆరోగ్యం సుస్థిరత కోసం పర్యవరణాన్ని అర్థం చేసుకోవడం అనే అంశంపై ఇచ్చిన ఐదు ఉప అంశాలపై విద్యార్థులతో పరిశోధనలు చేయించాలి.

పి.రామకృష్ణ, ఆప్కాస్ట్, జిల్లా కోఆర్డినేటర్, పార్వతీపురం మన్యం.

బాలలను సన్నద్ధం చేయాలి



పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలల సైన్స్ కాంగ్రెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు సిద్ధం చేసిన ప్రాజెక్టులు సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించేలా చూడాలి. ఔత్సాహిక విద్యార్థులను జిల్లా స్థాయి ప్రదర్శనలకు సంసిద్ధం చేయాలి.

కె.ప్రేమ్‌కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

● ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ



ఘటనా స్థలంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: నిత్యం ప్రమాదాలకు నెలవుగా మండలంలోని అట్టలి కూడలి మారింది. పాలకొండ వయా వీరఘట్టం, పార్వతీపురం-రాయగడకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో అట్టలి మలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం పాలకొండ నుంచి దాదాపు 340 వంటగ్యాస్ సిలిండర్లతో వీరఘట్టం వైపు వెళ్తున్న లారీ ఈ మలుపు వద్ద అదుపు తప్పి సమీప తోటల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడం, సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తాకకుండా తోటలో లారీ బోల్తా పడడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవీ.కృష్ణారావు ఎస్సై బి.శివప్రసాద్, అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావులు ఘటనా స్థలానికి చేరుకుని వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, గ్రామ సర్పంచ్ కె.దాములుతో మాట్లాడి ప్రమాదంపై ఆరాతీశారు.

ముంబై ఘన విజయం



ట్రోఫీతో ముంబై జట్టు

విజయనగరం: ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ సారథ్యంలో నిర్వహించిన అండర్-19 మహిళల అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్లో ముంబై జట్టు ఘన విజయం సాధించింది. ఫైనల్స్‌లో ప్రత్యర్థి మహారాష్ట్ర జట్టుపై ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచిన ముంబై క్రీడాకారులు 8 వికెట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. డెంకాడ మండలంలోని చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు 33.3 ఓవర్లలో 89 పరుగులకే 10 వికెట్లు నష్టపోయింది. ముంబై బౌలింగ్‌లో హుర్లేగాలా 7 ఓవర్లలో 4 వికెట్లు, అశ్విని నిషాద్ 10 ఓవర్లలో 3 వికెట్లు, కాశిష్ 5 ఓవర్లలో 2 వికెట్లు దక్కించుకుని మహారాష్ట్ర బ్యాటర్‌లను ముప్పుతిప్పలు పెట్టారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ముంబై జట్టు కేవలం 17.2 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 92 పరుగులు జోడించి విజయం సాధించింది. జట్టు బ్యాటింగ్‌లో సానిక చాల్కే 43 పరుగులు, సాలోని 33 పరుగులతో రాణించారు. విజేతలకు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి, డీఎస్ఏ కార్యదర్శి రాజు, ఎంఎస్‌కుమార్, కిశోర్‌రాజు, సీతారామరాజులు ట్రోఫీలు ప్రదానం చేశారు.

చెరువులో పడి దివ్యాంగుడి మృతి

భోగాపురం: మండల కేంద్రంలోని నెయ్యిల వీధికి చెందిన దివ్యాంగుడు ఆవల రమణ (35) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. దీనిపై మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పుట్టుకతోనే దివ్యాంగుడైన రమణ చిన్న చిన్న కూలిపనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య కనకతో పాటు తండ్రి నర్సింగరావు ఉన్నారు. బుధవారం సాయంత్రం బహిర్భూమికని రమణ ఇంటి నుంచి వెళ్లాడు. చీకటి పడుతున్నా ఎంతకీ రాకపోవడంతో బంధువులతో కలిసి తండ్రి, భార్య చుట్టుపక్కల ఎంత వెతికినా ప్రయోజనం లేకపోయింది. గురువారం ఉదయం పంచాయతీ వెనుక ఉన్న చెరువులో రమణ మృతదేహం తేలియాడింది. స్థానికుల ద్వారా ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఆటో బోల్తాపడి గాయపడిన మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన ఎరుసు రాము(60) తగరపువలసలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాము ఆటో నడుపుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రోజుమాదిరిగా ఈనెల 20వ తేదీన ఆటో వేసుకుని భోగాపురం స్టాండ్‌కు బయల్దేరాడు. తిరిగి పనులు ముగించుకుని ఆటోలో ఇంటికి వస్తుండగా జగ్గయ్యపేటకు చేరుకునేసరికి ముందువెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో స్థానికులు ఆటోను పైకి లేపి చేసి తీవ్రగాయాల పాలైన రామును గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించగా కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు.

అన్నివర్గాలకూ సమన్యాయమే ప్రభుత్వ లక్ష్యం

● ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయం ఇన్‌చార్జ్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఈ మేరకు గురువారం వారు గజపతినగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభలో గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకే సామాజిక సాధికార యాత్ర చేపట్టినట్లు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో గ్రామస్వరాజ్యం

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేడు తీసుకు వచ్చారన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ఒక్క గజపతినగరం నియోజకవర్గానికే వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా రూ.1100 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిందన్నారు. గతంలో తెలుగు దేశం పార్టీ దాచుకోవడం, దోచుకోవడం తప్ప ఇటువంటి సంక్షేమం , అభివృద్ధిని తీసుకువచ్చిందా? అని ప్రశ్నించారు. సామాజిక సాధికార బస్సు యాత్రకు రాష్ట విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాల నాయుడు, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మేరుగ నాగార్జున, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి పేర్ని నాని, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీసుబ్బారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు (సురేష్‌బాబు), జెడ్పీటీసీ గారతవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కె.ఆదినారాయణ, రేగ గోవిందరావు, కె.సుబ్రహ్మణ్యం, పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

'నా మట్టి..నా దేశాని'కి యువత పయనం

● జెండా ఊపి బస్సును ప్రారంభించిన జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: మట్టికి ప్రమాణాలు, వీరులకు వందనాలు నినాదంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన 'నా మటి నా దేశం' కార్యక్రమానికి జిల్లా నుంచి యువత వెళ్తున్న బస్సును జేసీ మయూర్ అశోక్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఢిల్లీకి పయనమయ్యే ఈ కార్యక్రమం సెప్టెంబర్1న ప్రారంభం కాగా అక్టోబర్ 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతి మండలం నుంచి మట్టి కలశాలను యువత తీసుకువెళ్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యువతలోని దేశభక్తిని జేసీ అభినందించారు. కార్యక్రమంలో సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, ఎన్‌వైకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పండగ... ఆనంద వేడుక



అమ్మ పండగ వచ్చిందంటే వారింట ఆనంద వేడుక. భక్తిశ్రద్ధలతో జాతరలో నిమగ్నమవుతారు. అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, సిరిమానోత్సవం విజయవంతమే లక్ష్యంగా రోజుల తరబడి శ్రమిస్తారు. ఆలయ అధికారులు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తారు. తరాల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని కలిసికట్టుగా కొనసాగిస్తున్నారు. సిరిమానోత్సవం సమీపిస్తున్నవేళ ఉత్సవంలో కనిపించే సంప్రదాయాలు... జాతరను ముందుండి నడిపిస్తున్న అమ్మవారి సేవకుల సేవలకు 'సాక్షి' అక్షరరూపం.

● పైడితల్లి ఉత్సవం.. సంప్రదాయాల కలబోత
● సిరిమానోత్సవంలో తలయారీ నుంచి సిరిమాను పూజారి వరకు నిమగ్నం
● ఉత్సవ సారథులుగా గుర్తింపు
● ఈ నెల 30, 31న జరగనున్న తొలేళ్లు, సిరిమానోత్సవానికి సన్నద్ధం

విజయనగరం డెస్క్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా విజయనగరం పైడితల్లి అమ్మవారు ప్రసిద్ధి. అమ్మవారి సిరిమానోత్సవం వచ్చిందంటే విజయనగరంలో సందడి మొదలవుతుంది. ఈ పండగలో పూర్వీకుల నుంచి కొన్నివర్గాల వారు నిమగ్నమవుతూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఉత్సవ సారథులుగా ముందుకు సాగుతున్నారు. లక్షలాది మంది భక్తులు తిలకించే సిరిమానోత్సవాన్ని విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారు.

● డప్పుమోగించి పండగకు శ్రీకారం



ఆలయ తలయారీలుగా సాకేటి వీధి వాసులు కొనసాగుతున్నారు. పండగ చాటింపు నుంచి తిరిగి వనంగుడికి అమ్మవారిని సాగనంపేవరకు సుమారు 15 మంది బృందంగా బాధ్యతవహిస్తారు. అమ్మవారు నగర వీధుల్లో సిరిమాను పూజారి రూపంలో సాక్షాత్కరించిన వేళ.. ఎలాంటి అవరోధాలు, దుష్టశక్తులు సిరిమానోత్సవానికి ఆటంకం కలిగించకుండా పాలధారతో ముందునడుస్తారు. పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ దుష్టశక్తులను తరిమికొడతారు. సిరిమానోత్సవాన్ని సాఫీగా ముందుకు సాగిస్తారు.

● అంజలి రథం



సిరిమానోత్సవంలో అంజలి రథానిది ఓ ప్రత్యేకత. పురుషులే ముత్తైదువుల వేషధారణలో అమ్మవారి చెలికత్తెలుగా అంజలిరథాన్ని అధిరోహిస్తారు. ఈ ఏడాది అంజలి రథాన్ని భోగాపురం రమణ, గురువెల్లి వెంకటరావు, పతివాడ గణేష్, నడిపేన మధు, మణిపురి నాగరాజు అధిరోహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగించేందుకు సన్నద్ధమవుతున్నారు.

● ఎల్ల ఏనుగు



రాజదర్పణానికి ప్రతీకగా అమ్మవారి వెంట ఎల్ల ఎనుగు నడుస్తుంది. ఏనుగు రథంపై బూర్లి అప్పారావు గంట మోగిస్తూ ముందుకు సాగుతారు. ఇది కూడా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.

● బెస్త వారి వల



పెద్దచెరువులో అమ్మవారు ఉన్నట్టు పతివాడ అప్పలనాయుడు కలలో కనిపించడం, మత్స్యకారులు వల వేయగా అమ్మవారి విగ్రహం వలకు చిక్కడాన్ని తెలియజేస్తూ బెస్తవారి వలను సిరిమానోత్సవంలో ప్రదర్శిస్తారు. ఇది మత్స్యకారుల సంప్రదాయినికి ప్రతీకగా నిలుస్తోంది.



పైడితల్లి రథం తయారీలో నిమగ్నమైన వడ్రంగులు

రథం తయారీలో నిమగ్నం

అమ్మవారి పండగ వచ్చిందంటే చాలు ఓ 15 మంది వడ్రంగుల బృందం సిరిమాను, రథం తయారీలో నిమగ్నమవుతుంది. మూడు వారాలపాటు నిష్టతో ఉండి పని పూర్తిచేస్తామని కనిమెళ్లరమణ, సత్యం, గురుపల్లి మహేష్, టేకు శంకరరావు, అప్పలనాయుడు, గోవింద్, రాంబాబు, శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు తెలిపారు. సిరిమానోత్సవం చక్కగా సాగితే చాలు తల్లికటాక్షాలు మాపై ఉన్నట్టే భావిస్తామన్నారు.

కట్లు కట్టేందుకూ ఓ బృందం

సిరిమాను, గిలకమానును రథంపై ఉంచి కట్లు వేయడంలోనూ నిపుణులైన బృందం వంశపారంపర్యంగా తల్లిసేవలో తరిస్తోంది. సిరిమాను తిరివీధికి ఎలాంటి ఆటంకం లేకుండా పనిముగిస్తుంది. ఇందులో తాళ్లపూడి సోమునాయుడు, కోరాడ నారాయణ, మహంతి జగన్నాథం తదితరులతో కూడిన బృందం పనిచేస్తుంది.

41 ఏళ్లుగా...



సిరిమాను, గిలకమాను, రథాల తయారీలో గత 41 ఏళ్లుగా నిమగ్నమవుతున్నాను. ఆ తల్లికి రథం చేసే అదృష్టం కలిగిందని పనిలో నిమగ్నమవుతాం . ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా రథాన్ని, సిరిమాను సిద్ధం చేస్తాం. ఆలయ అధికారులు చెప్పిన సమయానికి పని పూర్తిచేసి అప్పగిస్తాం.

– కనిమెళ్ల రమణ, వడ్రంగి

అమ్మవారి కరుణతోనే...



పైడితల్లి పసిడితల్లి. ఆమె కరుణా కటాక్షాలతోనే సిరిమానును అధిరోహిస్తున్నాను. 41 రోజుల పాటు నిష్టతో గడుపుతా. అమ్మవారి సేవలో తరిస్తా. ఆమె నామస్మరణతోనే రోజు గడుస్తుంది. తొలేళ్ల ఉత్సవం, సిరిమానోత్సవం రెండు రోజులూ ద్రవపదార్థాలే తీసుకుంటాను. అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా ఉండాలి. అందరూ బాగుండాలి.

– బంటుపల్లి వెంకటరావు, సిరిమాను పూజారి

తల్లి సేవలో తరిస్తాం..



తల్లి పండగకు డప్పుమోగించి చాటింపు వేస్తాం. ఆ రోజు కోసం ఏటా ఎదురు చూస్తాం. పైడితల్లి వనంలో ఉన్నప్పుడు మా తాత ముత్తాతలు కాపలాగా ఉన్నారు. తల్లి సేవలో పాలుపంచుకుంటామని రాజులకు ఇచ్చిన మాట ప్రకారం 'పాలధార'తో సిరిమానోత్సవంలో ముందుకు సాగుతాం. ఏ దుష్టశక్తి అమ్మవారిపై పడకుండా డప్పుశబ్దాలు, జమికుల వాయిద్యాలతో ముందుకు సాగుతాం. సైనికులుగా అమ్మవారికి కాపాలా కాస్తాం. ఆ తల్లి ఆశీస్సులు నిత్యం మాపై ఉంటాయని నమ్ముతాం.

– పైడి చిన్నరాజు, ఆలయ తలయారీ